# అపర కుంభకర్ణుడు

-డా. కొఠారి వాణీచలపతిరావు

సరదాగా కుటుంబంతో ఏ సినిమాకో, షికారుకో వెళ్దామని బయలుదేరి తీరా చెప్పులు తొడుక్కుంటున్న సమయంలో ఆకాశం నుంచి చుక్క తెగిపడ్డట్టు అనుకోని అతిధులెవరైనా దిగబడితే ఎవరికైనా ఎలా ఉంటుందీ! ప్రస్తుతం నా పరిస్థితీ అలాగే ఉంది.

సినిమా కెళ్దామని తయారవుతున్నాం నేనూ, మా ఆవిడా, మా పెద్దోడూ, చిన్నోడూ కలిసి. ఇంతలో ఓ భారీకాయం మా గుమ్మం ముందు వచ్చి నిల్చుని- "వంకాయల వామనరావు ఇల్లు ఇదేనా?" అంటూ ఘీంకారం చేసింది.

ఘీంకారం అని ఎందుకన్నానంటే గున్న ఏనుగుకు పొందూరు పంచెకట్టి, తెల్ల చొక్కా తొడిగి వందనా బ్రదర్స్ వారి బిగ్‌షాపర్ ఒకటి తొండానికి తగిలిస్తే ఎలా ఉంటుందో అచ్చం ఆయన అలాగే ఉన్నాడు గనుక.

బానపొట్ట, పీనవక్షం, గండుముఖంతో కోరలు, కొమ్ములు ఒక్కటే తక్కువగానీ అవి కూడా ఉంటే పాత సినిమాల్లో రాక్షసునికి ఏమాత్రం తీసిపోడు.

ఆ మనిషి అలా ఉన్నాడంటే ఆయన నోటంట వచ్చిన వంకాయల అన్న పేరు నాకు మరింత చికాకు కలిగించింది. నన్ను పూర్తి ఇంటిపేరుతో అంత పొడుగ్గా అలా పిలవకపోతే 'వామనరావు అనో, వి.వామనరావు అనో పిలవొచ్చుగా' అనుకున్నాను కోపంగా.

మా ఇంటిపేరంటే నాకు మొదటినుంచీ అదో విధమైన కాంప్లెక్స్. వంకాయ, బెండకాయ అవన్నీ కూరగాయల పేర్లుగానీ ఇంటి పేర్లేమిటి నా ముఖం.

ఇంక తెలుగులో పేర్లేమీలేనట్లుగా ఆ పేరును నిర్ణయించిన మా వంశపెద్దలను అనాలి. వాళ్లనేమీ అనలేను గనక ఎక్కడ రాసినా వి.వామనరావు అని మాత్రమే రాస్తాను.

స్కూల్‌లో చదువుకుంటున్న రోజుల్లో తోటిపిల్లలు రిజిస్టర్‌లో నా పూర్తిపేరు చూసి నేను కనబడగానే 'వంకాయలోయ్...వంకాయలు..లేతలేత వంకాయలు' అని కోరస్‌లో అరిచేవాళ్లు.

కాలేజీలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఓ అల్లరి అమ్మాయి మాటలో మధ్యలో మాటిమాటికీ వంకాయ్ అంటూ ఉండేది అదో ఊతపదంలా. అదిగో అప్పటినుంచే మా ఇంటిపేరంటే నాకు ఎలర్జీ మరింతగా పెరిగిపోయింది. నా వాళ్ళు అనుకున్న అయినవాళ్ళూ, స్నేహితులూ అలా పిలిస్తేనే నాకు మండుతుంది.

అలాంటిది ఎవరో ఓ అనామకుడు గుమ్మం ముందు నిల్చుని 'వంకాయల వామనరావు' అంటూ తనే బొడ్డుకోసి పేరెట్టినట్టు పిలుస్తుంటే మరింత మండదూ మరి?

అందుకే ఆయన ప్రశ్నను వినీ విననట్టు మౌనంగా ఉండిపోయాను. మా ఆవిడకు కాస్త మొహమాటాలూ, మర్యాదలూ ఎక్కువ. అందుకే తెగ ఆవేశపడిపోతూ "ఆ!ఆ! ఇదే...ఇదే! మా వారే వామనరావుగారంటే. రండి...రండి" ఆయన్ని లోపలికి ఆహ్వానించింది.

వెల్‌కమ్ అయితే చెప్పిందిగానీ 'అంత భారీ శరీరం లోపలికి రావడానికి మా వీధి గుమ్మం సరిపోతుందా? లేదా?' అని నాకు అనుమానం వచ్చింది.

ఇలాంటి అనుభవాలు నాకు నిత్యం ఎదురయ్యేవే. డోంట్‌వర్రీ అంటున్నట్టుగా ఆయన ముందు అభిముఖంగా లోపలికి రాబోయి అది సాధ్యంకాక ఆ తరువాత పక్కకు తిరిగి తట్టుకుంటూ, తారుకుంటూ, నెట్టుకుంటూ మొత్తానికి ఎలాగైతేనేం లోపలికి వచ్చి పడ్డాడు. బాగా ప్రాక్టీస్ ఉన్న మనిషిలా ఉన్నాడు. లేకుంటే ఎంతమంది ఎన్ని గుమ్మాలని ఆయన కోసం వెడల్పు చేయిస్తారు. అది అంత త్వరగా అప్పటికప్పుడే సాధ్యమయ్యే పని కూడా కాదుకదా!

రానైతే వచ్చాడు గానీ ఆయనను కూర్చుండబెట్టడానికి మా ఇంట ఆ సైజ్ కుర్చీలు లేవు. సోఫా ఉంది కానీ అది బక్కచెక్క. ఎక్కడ విరిగి ముక్కలవుతుందో అని భయం. అయినా కూర్చోమనక తప్పదు.

బితుకుబితుకుమంటున్న గుండెలతోనే "కూర్చోండి" అన్నాను లోగొంతుకతో.

అంతే! ఆకాశం నుంచి అంతరిక్ష నౌకా శకలమేదో దబ్బున భూమిమీద పడ్డట్టు లటుక్కున ఆయన కుర్చీలో కూర్చోగానే పెద్దశబ్దంతో పటపటమంది సోఫా.

"క్షమించాలి! మిమ్మల్ని గుర్తుపట్టలేదు..మీరు?" అంటూ ఆగిపోయాను.

"అర్నీ! నన్నే గుర్తుపట్టలేదా? నేనురా వామనరావ్! పర్వతాల రావు మామయ్యను. మీ అమ్మమ్మ చెల్లెలి కొడుకుని. చిన్నప్పుడు నువ్వు తరచూ మీ అమ్మమ్మగారి ఊరు గంపలగూడెం వస్తుండేవాడివి. నేనూ తరచూ వస్తుండేవాడ్ని గనుక అక్కడ చూస్తుండేవాడ్ని. అయినా అప్పుడు నీది గోచీలు పెట్టుకుని తిరిగే వయసులే. అందుకే నేను సరిగా గుర్తుండి ఉండను నీకు" అంటూ హ్హహ్హహ్హ అంటూ అకారణంగా వికటాట్టహాసం ఒకటి చేశాడు ఆ పర్వతం శరీరమంతా ఊగిపోతుండగా.

నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ నేనెప్పుడూ చిన్నతనంలో గోచీలు పెట్టుకుని తిరగలేదు. నా ఊహ తెలియని వయసు గురించి ఆయన మాట్లాడుతున్నాడేమో నాకు తెలియదు.

మా అమ్మమ్మగారి ఊరు గంపలగూడెమే కానీ ఇక్కడ ఆయన్ని ఎప్పుడూ చూసిన గుర్తురావడం లేదు.

బడి ఎగ్గొట్టడం, అమ్మమ్మ దగ్గర గారాబాలు పోవడం లీలగా గుర్తుంది గానీ ఆ గోచీల సంగతి మాత్రం గుర్తులేదు. ఆ పోస్టర్‌లో నన్ను నేను నా కళ్ళముందు నిలబెట్టుకుని మళ్లీ అంతలోనే ఆ దృశ్యం చూడలేక నాకు నేనే కళ్ళు మూసుకున్నాను.

దానికితోడు ఆయన గోచీ అన్నప్పుడల్లా మా ఆవిడ నవ్వు.

ఆయన సోఫాలో సెటిల్ అయిపోతూ అప్పుడు తీరుబడిగా ఆరడుగుల రెండు అంగుళాల పొడవైన నా శరీరం వంక నఖశిఖపర్యంతం కళ్ళు విప్పుకుని చూసి "మీ అమ్మమ్మ విష్ణుభక్తురాలు. ఆమెకు భాగవతంలో వామనకథ అంటే చాలా ఇష్టం. అందుకే నీకా పేరు పెట్టుకుంది. పొట్టి చేతులు, పొట్టికాళ్లతో చిన్నగా కుదమట్టంగా ఉండి ఉంటే పేరుకు తగ్గట్టుగా ముద్దుగా ఉండేవాడివి. నువ్వు చూస్తేనేమో మరీ గెడకర్రాలా ఇంతెత్తున పెరిగిపోయావు. నువ్వు ఇంత పొడుగవుతావని మీ అమ్మమ్మ ఊహించి ఉంటే త్రివిక్రముడు అన్న పేరయినా పెట్టుకుని ఉండేది" అని అహ్హహ్హ అని



మళ్లీ భయంకరంగా నవ్వాడు పర్వతాలరావు.

పైకి ఏమీ అనలేక లోలోపలే పళ్ళు కొరుకుతూ 'నువ్వున్నావుగా పేరుకు తగ్గట్టు పర్వతం సైజులో' అనుకున్నాను మనసులోనే కసిగా.

చక్కటి సినిమా ప్రోగ్రాం చట్టుబండలైనందుకు అప్పటికి మా ఆవిడ నా వంక సూదుల్లాంటి చూపులు ప్రసరింపచేస్తోంది.

మా పెద్దాడు ముఖం అట్ల పెనంలా మాడ్చుకుని సింహద్వారం పట్టుకుని వేళ్లా డుతూ ఉన్నాడు.

అడిగి పనులు చేయించుకోవడం తప్ప అలగడం తెలియని మా చిన్నాడు నా చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ "నాన్నా సినిమా....నాన్నా సినిమా" అంటు న్నాడు నాకు మాత్రమే వినబడేలా.

అయినా విషయం పసిగట్టేశాడు మామయ్యనని చెప్పుకుంటూ మా ఇంటికి అతిథిగా వచ్చిన పర్వతాలరావు.

"ఏంటీ అంటున్నాడు కుర్రాడు" అన్నాడు.



## ప్రేమబాణం

చాలాకాలం తర్వాత తెలుగు ప్రేక్షకులకి కనిపించి ప్రేమబాణాలు విసి రినట్టుంది గజాలా. స్టూడెంట్‌నెంబర్-1 వంటి హిట్ చిత్రంలో మంచి ప్రేమ పాటతో అందర్నీ అలరించిన ఈ భామ ఇప్పుడు శివకాశిలో నటించి మంచి బ్రేక్ సాధించే అవకాశాన్ని పొందింది. జగపతిబాబు, అర్జున్ నటిం చిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి మార్కులే పొందుతుండడంతో ఈమె హేపీగా ఉంటోంది. తెలుగులో మళ్లీ బ్రేక్ సాధిస్తానన్న నమ్మకం కలి గించింది అని ధీమాగా చెబుతోంది.




"ఆఁ ఏంలేదు" అన్నాను మొహమాటంగా ముఖం పెట్టి నసుగుతూ.

"ఎటో వెళ్దామని బయలుదేరినట్టున్నారు" అన్నాడు ఆయనే మళ్లీ.

"పిల్లలు సినిమా కెళ్దామంటే.." అంటూ అర్థోక్తితో ఆగిపోయాను.

"అయ్యో అలాగా! వెళ్లండి అయితే"

"మీ భోజనం?"

"దాని గురించి మీరేమీ వర్రీకాకండి. నేను తినేది ఎంత? నాలుగు మెతు కులు. అన్నాల బల్లమీద అన్నీ పెట్టి వెళ్ళారంటే నేనే పెట్టుకుని తింటాను. అమ్మాయ్...నీ పేరు?" అంటూ మా ఆవిడను ఉద్దేశించి అడిగాడు.

"కాంతామణి!?" అంది మా ఆవిడ.

"చక్కటి పేరు. చూడమ్మా కాంతామణీ. కూర, పచ్చడి, పులుసు మీ కోసం చేసుకున్నవి ఎలాగూ ఉండి ఉంటాయి కదా. ముద్దపప్పు లేందే నాకు ముద్ద దిగదు. కరకరలాడే ముక్క వడియాలు, పిండివడియాలు, ఊర మిరప కాయలు నిత్యం నాకు భోజనంలో ఉండాల్సిన పదార్థాలు.. అవి ఉండేలా చూడు. ఆ చేత్తోనే కాస్తంత పాయసమో, పొంగలో చేయి. భోజనానంతరం నోరు తీపి చేసుకోకపోతే నాకు ఎలాగో ఉంటుంది" అంటూ ఆయన అలా చెప్పుకుంటూ పోతుంటే "చాలా...లేక ఇంకా ఏమైనా?" అన్నాను.

నా మాటల్లోని వ్యంగ్యం ఆయనకు అర్థమై చచ్చినట్లు లేదు.

"సినిమాకని బయలుదేరారు కదా. అంతకన్నా ఎక్కువ చేయడానికి పాపం అమ్మాయికి టైం సరిపోవద్దూ. ఉంటానుగా నాలుగురోజులు. మీరు చేయబోయే మర్యాదలన్నీ. ఆనక సంతృప్తిగా స్వీకరిస్తాను. అతిథి దేవోభవ అన్నది మన గృహస్థధర్మం. మీ ధర్మాన్ని మీరు నిర్వర్తించుకుంటానంటే కాద నకుండా నేనూ సహకరించాలి కదా" అన్నాడు.

ఆమాటలు విని మా ఆవిడ "ఒకసారి ఇలా రండి" అంటూ వంటింట్లోంచి సైగ చేస్తూ లోగొంతుతో పిలిచింది.

వెళ్లాను.

"ఆయన చదివిన లిస్ట్ అంతా తయారుచేసి పెట్టి సినిమా కెళ్లాలంటే అప్ప టికల్లా ఇంటర్వెల్ కూడా అయిపోతుంది. ఈరోజు నేనసలే ఒక కూర, చారుతో వంట ముగించాను. కనుక ఆయనకు వండి, వార్చి, వడ్డించి తినబెట్టి ఆ తర్వాత తీరుబడిగా సెకండ్‌షోకి వెళ్దాం" అంది కాస్తంత నిరుత్సాహం, మరి కాస్త విసుగు కళ్ళలో, మాటల్లో వ్యక్తమవుతుండగా.

"సరే! అలాగే చేద్దాం..." అంటూ బయటికి వచ్చేశాను. పిల్లలకూ ఆ విషయం చెప్పి "అందాకా చదువుకోండి" అని అదనంగా ఓ ఆర్డర్ కూడా పాస్ చేశాను.

గుర్రుగా చూశాడు నావంక పెద్దోడు.

నేలమీదే కథాకళీ చేశాడు చిన్నోడు.

వెరసి మా కుటుంబసభ్యులు నలుగురికీ అనుకోని ఆ అతిధి మీద పీకలవ రకూ కోపం వచ్చింది.

ఆ కోపంలోనే మా శ్రీమతి కాంతామణి అంది.

"ఆయన్ను మీరు గుర్తుపట్టలేదంటున్నారు. నిజంగా మన అతిథేనా? లేక మీ పుట్టుపూర్వోత్తరాలు గోచీతో సహా ఎంక్వాయిరీ చేసి బట్టీపట్టి వచ్చిన ఏ దొంగ వెధవైనానా. అది తెలుసుకోండి ముందు. ఇలాంటివి ఈరోజుల్లో బోలెడు సంఘటనలు జరుగుతున్నాయి. అదీగాక ఆయన ముఖం చూస్తుంటే పిలవని ఫంక్షన్లకు కూడా వెళ్లి పీకలదాకా మెక్కివచ్చే రకంలా కన్పిస్తోంది" అంది.

మా మాటల్ని విన్నాడేమో అని అనిపించేలా "వామనరావ్!" అని ఓ గావు కేక పెట్టి "మీ అమ్మమ్మ, మా అమ్మ కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి ఉంటే నువ్వు చూస్తావని తెచ్చాను" అంటూ బిగ్‌షాపర్‌లో నుంచి ఓ బ్లాక్ అండ్ వైట్ ఫోటో తీసి చూపించాడు.

ఇంకేం మాట్లాడను.

సాక్షాత్తూ ఆయన మా అతిథి దేవుడే అని అలా నిరూపించబడినాక?

మా ఆవిడ వంటింట్లో బిజీగా ఉంది.

"కూర్చోవోయ్ వామనరావ్!'' అని పర్వతాలరావు మామయ్య పిలవ డంతో వెళ్లి దగ్గరగా కూర్చోక తప్పిందికాదు నాకు.

నా ఉద్యోగం, నా సంపాదన, నేను కూడబెట్టిన ఆస్తిపాస్తుల గురించి వివ రాలు అడగడం మొదలుపెట్టాడు ఆయన.

నాకూ ఆయన గురించి తెలుసుకోవాలని అనిపించి "మీరేం చేస్తుం టారు?'' అని అడిగాను.

"ప్రస్తుతం ఏమీ చేయడం లేదుగానీ పూర్వాశ్రమంలో మాత్రం రాజకీయ నాయకుడ్ని'' తాపీగా అన్నాడు మామయ్య.

అదిరిపడ్డాను నేను. తలెత్తి ఆయన వంక ఎగాదిగా చూశాను.

నా చూపులకి అర్థం కనిపెట్టాడో ఏమో తనకు తానే మళ్లీ అన్నాడు.

"ఏదో పదవిమీద మోజుతో ఆ రంగంలో ఉంటే నాలుగుడబ్బులు వెనకేసు కోవచ్చున్న ఆశతో ఎలాగైతేనేం ఎన్నికల్లో నెగ్గి ఎమ్మెల్యే కుర్చీ సంపాదించాను. కానీ కూర్చున్నాక తెలిసింది. అందులో కుదురుగా, నిటారుగా కూర్చోవడం ఎంత కష్టమో. నాకు చిన్నప్పట్నించీ కాస్త నిద్ర ఎక్కువ. చచ్చినా నిద్ర ఆపు కోలేను నేను. అదేం ఖర్మమో ఆ కుర్చీలో కూర్చోవడం ఆలస్యం..నిద్రవచ్చేది. వెళ్లక వెళ్లక ఎప్పుడైనా అసెంబ్లీకి వెళితే అక్కడా అంతే! ఐదేళ్ళు అలా నిద్రపో తూనే కాలం వెళ్ళబుచ్చాను. ఓ రోజు సడెన్‌గా లేచి చూసేసరికి ఐదేళ్ళు గడిచి మళ్లీ ఎన్నికలు వచ్చాయి.మళ్లీ ఎన్నికల్లో నిలబడ్డాను గానీ ఈసారి డిపాజిట్ కూడా దక్కలేదు.

ఓటు అడగడానికి నియోజకవర్గంలో కాలుబెడితే ఆడవాళ్ళు ముఖాన పేడనీళ్ళు చల్లారు.

మగవాళ్ళు "మళ్ళీ ఇక్కడ కాలుబెట్టావంటే కాళ్ళు విరగ్గొడతాం'' అని నిర్మొహమాటంగా చెప్పేశారు.

అంతే! ఇక ఈ రాజకీయాలు మన వంటికి పడవని హాయిగా తింటూ తిరు గుతూ, నిద్రపోతూ ఇలా కాలక్షేపం చేస్తున్నాను.

నేనసలే కాస్త బద్ధకం మనిషిని. ఏ పనిచేయాలన్నా ఓపిక ఉండదు. అందుకే కదలకుండా స్వగ్రామంలో ఉంటున్నాను. ఉన్న ఊళ్ళో ఉండి ఉండీ అతిథిగా ఏ ఇంటికెళ్లినా అందరూ గౌరవించి, మర్యాదలు చేసేవాళ్ళేగా. అందుకే హాయిగా గడిచిపోతున్నాయి రోజులు'' అంటూ ముగించాడు పర్వ తాలరావు మామయ్య.

నిర్మొహమాటంగా, సిగ్గూ, లజ్జా లేకుండా తన పూర్వాశ్రమ కథను ఓ కామెడీ కథలా వినిపించిన ఆయన నిజాయితీని మెచ్చుకోవాలో లేక కనీసం ఏది చెప్పొచ్చో, ఏది చెప్పకూడదో కూడా తెలియని అమాయకుడు, తెలివిత క్కువ రకం అని అనుకోవాలో నాకు అర్థంకాలేదు.

మా ఆవిడ లోపలినించి "వడ్డించాను'' అనడంతో భోజనాలకు లేచాం. నాలుగు మెతుకులు నా భోజనం అన్న మనిషి అనకూడదు గానీ నలుగురి మనుషుల పెట్టు లాగించేశాడు.

మా కాంతామణి కంగారు అంతా ఇంతాకాదు.

వడ్డించిన పదార్థాలు చాలక వంటింట్లోకి, డైనింగ్ రూంలోకి రన్నింగ్‌రేస్ చేసింది.

వండిన కూరలు ఆదిలోనే అయిపోయి నానా అవస్థలు పడిపోయింది.

తను తిన్నానని చెప్పిందికానీ తినలేదని నా అనుమానం.

పర్వతాలరావు మామయ్య అన్నంతిని బ్రేవ్‌మని తేలుస్తూ చెయ్యి తడి కూడా ఆరకముందే సోఫా మీద అడ్డంగా వాలిపోయాడు తినగానే నాకు నిద్ర రొస్తుంది అంటూ.

"బాబాయి గారూ! మీరు ఇక్కడ పడుకోండి. మేం సినిమా నుంచి వచ్చి బెల్ కొట్టగానే మీరు విని తలుపు తీయడానికి వీలుగా ఉంటుంది'' అంటూ దివాన్ మీద పక్క పరిచి దుప్పటి, దిండు ఇచ్చింది మా ఆవిడ.

"అలాగే'' అంటూ ఆయాసపడుతూ తన కొండ శరీరాన్ని సోఫా మీద నుంచి దివాన్ మీదకి షిఫ్ట్ చేశాడు మావయ్య అతి కష్టం మీద.

ఆయన్ని లోపల తలుపు పెట్టుకోమని చెప్పి మేం సినిమాకు వెళ్లి పోయాం.

* * *

చిన్నవాడు చిందులేస్తూ ముందు నడుస్తున్నాడు.

పెద్దవాడు "హమ్మయ్య సినిమా ప్రోగ్రాం కాన్సిల్ కాలేదు పోస్ట్ పోన్ అయింది అంతే!'' అంటూ గుండెలమీద చెయ్యేసుకుంటూ తెగ ఆనందపడిపో తున్నాడు. ఇక మా ఆవిడ ఆనందం ఆమె ముసిముసినవ్వులలో, మెరిసేక ళ్లల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"ఈ చుట్టం ఎవరండీ తెగిన తోకచుక్కలా అకస్మాత్తుగా ఇలా వచ్చిప


## ప్రమాదంలో పిల్లలు

విద్యాసాగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ అంచనా ప్రకారం ఇటీవల 15-18 ఏళ్ళున్న 1400మంది స్కూలు పిల్లల్లో 36శాతం మంది మద్యానికి అలవాటుపడ్డారుట. వాళ్లల్లో 38శాతం మంది ఆడపిల్లలు. పార్టీల్లో వారికీ అలవాటు అవుతోందిట. వాళ్లు ఈథర్ అమైల్‌నై ట్రేట్, నైట్రస్ ఆక్సైడ్, గ్లూ, కరక్షన్ ఫ్లూయిడ్, కార్బురెట్టర్ ఫ్లూయిడ్ వంటి మాదకద్రవ్యాలకి కూడా అలవాటుపడుతున్నారు. చిత్రమేమిటంటే తమకి చదువులో ఏకాగ్రత కలుగుతుందని ఈ మాదకద్రవ్యాలు వాడుతున్నట్టు వాళ్ళు భావిస్తున్నారు. పిల్లలు ఎంత అధోగతి పాలవుతున్నారో తెలుసు కునే తీరిక వాళ్ల తల్లిదండ్రులకి ఉండకపోవడం వాళ్ళ దురదృష్టం.

## భూప్రదక్షిణం

గతంలో విమానం మీద, బెలూన్ తోటి భూమిని చుట్టి వచ్చిన వాళ్ళు న్నారు. జెకోస్లొవేకియాకి చెందిన 71ఏళ్ళ వ్లాడిస్లవ్ జేడా అనే క్రీడాకారుడు భూమిని చుట్టి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నాడుట. దానికోసం ఒక ప్రత్యేకమైన గ్లైడర్‌ని తయారుచేస్తున్నారు. దాని డిజైన్ వివరాలన్నీ రహ స్యంగా ఉంచుతున్నారు. ఈ ప్రయాణంలో అతని 43ఏళ్ళ కుమార్తె హానా పైలట్‌గా ఉంటుందిట. ఇప్పటికే ఏభై గ్లైడింగ్ వరల్డ్‌రికార్డులు ఆమె స్వంతం. 22వేల మైళ్ల దూరాన్ని ఐదారురోజుల్లో పూర్తిచేయాలని తండ్రీ కూతుళ్ళు ప్లాన్‌లు వేస్తున్నారు.

-తటవర్తి



డ్డాడు. బకాసురుడిలా ఆ తిండేంటి?

అది పొట్టా... ధాన్యపు కొట్టా? పెట్టీపెట్టీ నా చేతులు పడిపోయాయి గానీ తినితినీ అతను మాత్రం అలిసిపోడే!'' అంది.

"ఇంకా నాలుగురోజులు ఇక్కడే తిష్టవేశాడంటే మనం ఆరిపోవాల్సిందే'' అని మా ఆవిడ అంటూండగా సినిమా హాలు వచ్చేసింది.

శుభం కార్డు పడ్డాక మళ్ళీ నడుస్తూ ఇల్లు చేరుకున్నాం కాళ్లీడ్చుకుంటూ.

మాకన్నా నాలుగడుగులు ముందువచ్చి గేటు తెరవడానికి ఉపక్రమించిన మా పెద్దాడు ఛెంగున ఒక్క గంతేసి "నాన్నా'' అని అరుస్తూ వచ్చి నా దగ్గర పడ్డాడు.

"ఏమయిందిరా?'' అన్నాను హడలిపోతూ.

వాడు గజగజా వణికిపోతూ "మన ఇంట్లో లోపలినించి భయంకర శబ్దం వస్తోంది. పులిగాండ్రింపులా ఒకసారి, రాక్షసుడి అరుపులా మరోసారి, ఫ్యాక్టరీ కూతలా ఇంకోసారి వినిపిస్తున్నాయి. నాగుండెలదిరిపోయాయి'' అని వాడు అంటూ ఉంటే నేను చకచకా గేటు వైపు నడిచాను. మా ఆవిడ, పిల్లలు భయంతో బయటే నిలబడిపోయారు.

తెరచి ఉన్న కిటికీలోంచి లోపలికి తొంగిచూస్తే అప్పుడు తెలిసింది ఆ భయంకరశబ్దాలు మా పర్వతాలరావు మామయ్య గురక బాపతువని.

ఆయనను ఇంట్లో ఉంచి వచ్చిన విషయం ఒక నిముషం పాటు అందరం మర్చిపోయాం సినిమా ఉత్సాహంతో.

చెవులు బద్దలైపోతున్నాయి. యింటి కప్పు ఎగిరిపోయేలా ఉంది. వర్షం లేకుండానే పిడుగుపడుతున్న భావన.

విషయం నేను చెప్పగానే "ఔరా!'' అనుకుంటూ మా వాళ్లంతా లోపలికి వచ్చారు.

కిటికీగుండా లోపలకి చూసే ప్రయత్నంలో ముగ్గురి మధ్యా తొక్కిసలాట జరిగి కాళ్ళూ, వేళ్ళూ ఒకరికొకరు తొక్కుకున్నాం కూడా.

మామయ్యని నిద్రలేపడం కోసం నేను కాలింగ్‌బెల్ కొట్టాను వెంటవెంట.

మనిషి ఒక్క ఇంచైనా కదిలితేనా? దివాన్ మీద కాళ్ళు బార్లజాపి వెల్లకిలా పడుకుని ఉన్నాడు మొదలు నరికిన ఓ పెద్దచెట్టులా.

ఇంతెత్తున పైకి లేచిన బొజ్జ ఓ ఎవరెస్ట్ శిఖరంలా ఉంది.

గురకననుసరించి గమ్మత్తుగా కదులుతున్న ఆయన బుగ్గలు, పాతాళ కుహలంలా తెరుచుకుని ఉన్న నోరు, కిందికి పైకి లయబద్ధంగా కదులుతున్న పొట్ట ఇవన్నీ మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచేయడమే కాదు భయపెట్టాయి కూడా.

మేం పదేపదే మోగించే కాలింగ్‌బెల్ శబ్దాలు తలుపుమీద దబదబా బాదుతున్న చప్పుళ్ళు.

"బాబాయిగారూ, మామయ్యా, తాతయ్యా'' అన్న మా భార్యభర్తల, మా పిల్లల అరుపులు విని ఇరుగుపొరుగు అంతా పరిగెత్తుకుంటూ వచ్చారుగానీ మా పర్వతం మాత్రం కొద్దిగా కూడా చలించలేదు. చూస్తూ చూస్తూండగానే ఇంటిముందు జనం మూగారు.

"మీరు ఇంట్లోలేరా. గాండ్రింపు శబ్దాలు వినిపిస్తుంటే పక్కన అడవిలోంచి ఏ పులి అయినా పారిపోయి వీధిలోకి వచ్చిందేమో అని హడలిచచ్చి నేను తలుపులు తీసుకుని బయటకు రాలేదు'' అంది పక్కింటి పానకాలమ్మ.

"మీరు బయటకు వెళ్లడం నేను చూశాను. చెవులు బద్ధలయ్యే ఆ శబ్దాలు విని దొంగలయితే అలా శబ్దాలు చేస్తారా. ఏ దుష్టశక్తో ఏ కిటికీలోంచో జారబడి ఉంటుందని హడలిచచ్చి ఆ తర్వాత మీ ఇంటివైపు కూడా చూడలేదు నేను'' అన్నాడు ఎముకలు తప్ప చటాకు మాంసం కూడా శరీరంలో లేని ఏకాంబరేశ్వరం.

మా ఇంటివెనుక ఉన్న అపార్ట్‌మెంట్‌లో అద్దెకుండే కానిస్టేబుల్ కనకారావు "నాకూ చచ్చేంతభయం వేసింది. దొంగలో, గూండాలో అయితే ఏమో గానీ దయ్యాల సంగతి నాకేం తెలుసు? వాటిని పట్టుకోవడం మా డ్యూటీ కాదు గనుక భూతవైద్యుడెవరైనా దొరుకుతాడేమోనని ఎంక్వయిరీ మొదలుపెట్టాను''అన్నాడు చేతులు దులుపుకుంటూ.

"ఆయన్ని త్వరగా లేపండి. లేకుంటే కొద్దిసేపట్లో మా చెవులు బద్ధలవుతాయి'' అన్నారు గుంపులో నుంచి ఎవరో.

దాంతో అందరూ కలిసి తలుపులు దబదబా బాదారు. పదేపదే కాలింగ్ బెల్ కొట్టారు. "ఏమండీ...సార్'' అంటూ కోరస్‌గా అరిచారు.

అయినా లాభం లేదు.

"నేనొక ప్లాన్ చెబుతాను ఉండండి'' అంటూ పానకాలమ్మ ఓ పెద్ద ప్లాస్టిక్ పైప్ తెచ్చి మా ఇంట్లో ఆరుబయట ఉన్న నల్లాకు తగిలించి మోటార్ ఆన్‌చేసి ఫోర్స్‌గా నీళ్ళు పర్వతాలరావు ముఖం మీదికి కొట్టింది. కొంచెం కదిలాడు ఆయన.

"లేస్తున్నాడు...లేస్తున్నాడు'' అని జనం ఆనందంతో కేకలుపెట్టారు. ఇటు


## వింత కేసు

రుమేనియాలో బాగా వర్షాలు పడతాయని వాతావరణ పరిశోధన విభాగం ఉద్యోగి తమ వాతావరణ ప్రకటనల్లో చెప్పాడుట. వారు చెప్పిన రోజుల్లో వర్షాలు పడి ఇబ్బందిపడతామని చాలామంది టూరిస్ట్‌లు తమ ప్రయాణాలు మానుకున్నారు. తీరావారు చెప్పిన రోజుల్లో ఎండలు శుభ్రంగా కాసి వాతావరణం ఆహ్లాదంగా ఉందిట. దాంతో హోటల్ యజమానులు వాతావరణ శాఖ వారిమీద తమ బిజినెస్‌కి కలిగిన నష్టానికి పరిహారం కోసం కోర్టుకెళ్లారు.

## బామ్మగారి సమస్య

ఇటలీలో పెస్కారాసిటీలో సోఫియాటోరినో అనే 90 ఏళ్ళావిడ ఓరోజున పోలీసు ఎమర్జెన్సీకి ఫోన్ చేసింది. పాపం ముసలావిడ ఏ ప్రమాదంలో ఉందో అని వాళ్ళు పరుగుపరుగున వచ్చారు. ఇంతకీ ఆమె సమస్య ఏమిటో చదివితే మీరూ నవ్వుతారు. ఆమె బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ సీరియల్ చూస్తుండగా హఠాత్తుగా టీవీ పాడయిందట. చివరిసీను ఏమవుతుందో అన్న ఉత్కంఠకొద్దీ పోలీసుల్ని పిలిచిందిట. ఔరా అని వాళ్లు ముక్కున వేలేసుకుని ఇక నుంచి ఇలాంటి రిపేర్లకోసం మమ్మల్ని పిలవకండి బామ్మగారూ అని విసుక్కుని ఆమె బాధ చూడలేక టీవీని రిపేర్ చేసి మరీ వెళ్ళారుట.

-విమలారామం



నుంచి అటు తిరిగి పడుకుని తిరిగి గురకను కంటిన్యూ చేయడం మొదలుపెట్టాడు. ఉఫ్ మంటూ పైప్ కిందపడేసి నల్లా బంద్ చేసి వచ్చింది పానకాలమ్మ.

"అలాకాదు నేను చెబుతానుండండి" అంటూ రోడ్డుమీదికెళ్లి కొన్ని గులక రాళ్ళు, గుండురాళ్ళు ఏరుకొచ్చి వాటిని ఒక్కొక్కరి చేతిలో ప్రసాదంలా ఒక్కొక్కటి పెట్టి "అందరూ విసరండి" అన్నాడు ఏకాంబరేశ్వరరావు.

"అయ్యో...అయ్యో...మా టీవీ, మా అద్దాల అలమారా" అని లబలబా మొత్తుకున్నాను నేను, మా ఆవిడ.

"వాటికి తగలనివ్వం. మీరు కంగారుపడకండి" అంటూ మక్కాలో సైతాన్ మీదికి హజ్ యాత్రికులు రాళ్ళు విసిరినట్టు తలా ఒక రాయి విసురుగా పర్వతాలరావు మీదికి విసిరారు.

అంతపెద్ద కొండను ఒక చిన్నరాయి ఏం చేయగలుగుతుంది. వీళ్ల పిచ్చిగాని!

గోడమీదికి బంతులు విసిరినట్టుగా అయింది. తన భుజాలను, వీపును, పిక్కలను ఎవరో మర్దన చేస్తున్నట్టుగా హాయిగా అనిపించిందో ఏమో మరింత సుఖనిద్ర తీశాడు పర్వతాల మామయ్య.

"నా గన్ తీసుకొచ్చి షూట్ చేయనా?" అన్నాడు కానిస్టేబుల్ కనకారావు ఆవేశంతో.

"వద్దువద్దు. చచ్చూరుకుంటాడు" అన్నారు ఎవరో.

"కాళ్లమీద గురిపెడతాను" అన్నాడు ఆయన.

ఈసారి నేను "వద్దు..వద్దు. ఆనక ఆయనకు వైద్యం చేయించలేక నేను ఛస్తాను. క్రిమినల్‌కేసు అయిందంటే కోర్టుచుట్టూ తిరగలేక చావాలి. అసలే మీ పోలీసులను నమ్మకూడదు. మనిషిని ఎదురుగా నిలబెట్టి కాల్చి ఎన్‌కౌంటర్ అనే రకాలు. మీరు కాల్చి ఆ గన్ నాచేతిలో పెట్టరని నమ్మకం ఏంటి?" అన్నాను వాదిస్తూ.

"ఐడియా!" అంటూ ఆ గుంపులో నుంచి ఓ పదేళ్ల కుర్రాడు ఛెంగున తన ఇంటివైపు పరిగెత్తి చేతిలో దీపావళి టపాకాయలతో తిరిగొచ్చాడు. సీమటపాకాయలు గుత్తికిగుత్తి వెలిగించి కిటికీలోనుంచి లోపలికి విసిరేశాడు.

"అమ్మో...మన ఇల్లు తగలబడిపోతుందేమోనండీ..." అంది మా ఆవిడ కంగారుగా.

"ఏంకాదులే. నువ్వూరుకో అమ్మా" అంటూ మా పెద్దాడు, చిన్నాడు కూడా ఆ అబ్బాయితో కలిసి హుషారుగా లక్ష్మీబాంబులు కాల్చి అతని మంచం దగ్గర పడేలా విసిరేశారు.

వీధి వీధంతా లేచింది "ఈ అకాల దీపావళి ఏంటి?" అంటూ.

"ఎక్కడన్నా బాంబు పేలిందేమో!" అన్న అనుమానంతో కొంతమంది ఇంట్లోనే కూర్చుని భయంతో గజగజలాడిపోయారుట.

అన్ని ప్రయత్నాలూ ఫెయిలైపోయాయి.

"ఇంతకూ ఏమిటి చేయడం? తలుపులు పగలగొట్టడం తప్ప వేరే మార్గం లేదు" అన్నారు ఎవరో.

"అమ్మో! వద్దు" అన్నాను బంగారం లాంటి తలుపులు బద్ధలవడాన్ని ఊహించుకుంటూ.

"ఎంతసేపని బయట కూర్చుంటారు. అంత గాఢంగా, అపరకుంభకర్ణుడిలా నిద్రపోయే ఆ భారీ మనిషి ఎప్పుడు లేస్తాడో, ఆ నిద్ర వదలడానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేం కదా!" అన్నారు వాళ్ళు. అలా అనగానే "ఐదేళ్ళు పడితే అలవాటుప్రకారం" అన్న ఆలోచనరాగానే "తలుపులు పగలగొట్టండి. ఏంచేస్తాం మరి?" అంది నా భార్య కాంతామణి.

"చుట్టమై వచ్చి దయ్యమై పట్టాడంటే ఇదే మరి" అని రుసరుసలాడింది.

అందరం భుజం తాపు ఇచ్చి మా బలం అంతా ప్రయోగించి ఓ అరగంట కష్టపడి చివరకు ఎలాగైతేనేం తలుపుగడియ విరగ్గొట్టాం.

ఆ శబ్దానికి మనిషి కొంచెం కదిలి అటునుంచి ఇటు తిరిగి పడుకున్నాడే గానీ లేవలేదు.


"ఇదేం మనిషి...ఇదేం నిద్ర!" అంది పానకాలమ్మ.

అందరం మంచం చుట్టూ చేరాం పిడిగుద్దులు గుద్దుతూ కొంతమంది, కుదుపులతో కొంతమంది, తొడపాశాలు, గిచ్చుళ్లతో మరికొంతమంది ఇలా అందరం కలిసి మొత్తానికి ఎలాగైతేనేం పర్వతాలరావును నిద్రలేపాం.

కొండ కదిలింది. కళ్ళు విప్పిచూసింది. పెటపెటమని ఎముకలు విరిగేలా వళ్ళు విరుచుకుంది.

అంతమంది జనాన్ని, విరిగిన తలుపులను, నీళ్ళు, కాగితం ముక్కలు, రాళ్లతో చిందరవందరగా ఉన్న ఇంటిని చూసి "సినిమా నుంచి వచ్చారా? బెల్ కొడితే లేచేవాడ్నిగా! ఈ జనం, ఈ హడావుడీ ఇదంతా ఏమిటి?" అని ఎదురుప్రశ్న మమ్మల్నే వేయడంతో పిచ్చివాళ్లలా ఒకళ్ళ ముఖాలు ఒకళ్లం చూసుకున్నాం ఎవరి జుట్టు వాళ్లమే పీక్కుంటూ.

★



## అవకాశాల వెల్లువ

తారలకి ఎలాంటి ఒత్తిడి లేని అవకాశాలు ఇప్పుడు వస్తున్నాయి. హిట్‌లు, ఫట్‌లతో సంబంధం లేని ఇలాంటి అద్భుతావకాశాల్ని వారు బాగానే వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు అసిన్ వంతు వచ్చినట్టుంది. వరుస హిట్‌లతో అందర్నీ అలరించిన ఈ కేరళభామ ఇప్పుడు కాల్గేట్, ఫెయిరెవర్, పెప్సీకోలా, పారాచూట్ కంపెనీలు ఈమెని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాయి. దీంతో ఇప్పుడీమె చాలా బిజీ అయిపోయింది.

